
సాక్షి ఒడిశా

మంగళవారం । 7 । నవంబర్ । 2023



శ్రీమందిరం ఆదాయం లెక్కింపు

నగదు	రూ.4.73.213
బంగారం	2 గ్రాముల 100 మిల్లీ గ్రాములు
వెండి	6 గ్రాముల 550 మిల్లీ గ్రాములు

– భువనేశ్వర్/పూరీ



గృహ నిర్మాణాల జాప్యంపై అసంతృప్తి

ప్రధానమంత్రి ఆవాస్ యోజన పథకంలో భాగంగా లబ్ధిదారులు ఇళ్ల నిర్మాణాల్లో జరుపుతున్న జాప్యంపై మున్సిపల్ సమావేశంలో అసంతృప్తి వ్యక్తమయ్యింది.

- IIలో



సమస్యలు పరిష్కరించాలని వినతి

రాయగడ చెక్కాగుడ ప్రాంతంలోని జుల్లావీధిలో నివాసముంటున్న 46 కుటుంబాలకు చెందిన మహిళలు తమ సమస్యలను పరిష్కరించాలని కోరారు.

- IIలో

ఆకట్టుకున్న ఫ్యాషన్ షో



మాట్లాడుతున్న ఎంపీ చంద్రశేఖర్, ఎమ్మెల్యే విక్రమ్ పండా తదితరులు



ఫ్యాషన్ ర్యాంప్ షోలో పోటీ పడుతున్న లిటిల్ కిడ్స్



ప్రతిభ కనబర్చిన చిన్నారులు



పోటీలో పాల్గొన్న చిన్నారి

స్థానిక హిల్‌పట్నా మెయిన్ రోడ్డులోని బిజూ పట్నాయక్ సాంస్కృతిక భవన ప్రాంగణంలో ట్వింకిల్ ఫ్యాషన్ అకాడమీ ఆధ్వర్యంలో ట్వింకిల్ ఫ్యాషన్ గ్రాండ్ ఫైనల్ షో ఆదివారం ఘనంగా జరిగింది. ముఖ్య అతిథిగా బరంపురం ఎంపీ చంద్రశేఖర్ సాహు, ఎమ్మెల్యే విక్రమ్ పండా మరియు నగర మేయర్ సంఘమిత్ర దొళాయి పాల్గొని పోటీలను ప్రారంభించారు. అనంతరం రాష్ట్రంలోని వివిధ పాప్ సింగర్స్ తమ సంగీత గేయాలతో ఆకట్టుకున్నారు. అనంతరం గంజాం జిల్లా పరిధికి చెందిన చిన్నారులు ఫ్యాషన్ షో మిస్టర్ ఎండ్ మిస్ కిడ్స్ పోటీల్లో పాల్గొని ర్యాంప్ షోలో ప్రతిభని కనబరిచారు. కార్యక్రమంలో కళాకారులు, వివిధ సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

– బరంపురం

న్యూస్‌రీల్

అదుపుతప్పి ఆటో బోల్తా

• ముగ్గురికి తీవ్రగాయాలు



తీవ్రంగా గాయపడిన త్రినాథ్ పంగి

జయపురం: సబ్ డివిజన్ పరిధి బొయిపరిగుడ సమితి బాసినీగుడ గ్రామ కూడలి వద్ద ఒక ఆటో అదుపుతప్పి ప్రమాదానికి గురవ్వడంతో ముగ్గురు వ్యక్తులు గాయపడ్డారు. స్థానికులు తెలిపిన వివరాల మేరకు.. అమతాపుట్ సమితి పూజారిపుట్ గ్రామం నుంచి ఏడుగురు వ్యక్తులు బొయిపరిగుడ సమీప లకమాలియగుడ మందిరానికి పూజలు చేసేందుకు సోమవారం వెళ్లారు. అయితే వీరు వెళ్తున్న ఆటో బొయిపరిగుడకు మూడు కిలోమీటర్ల దూరంలోని కుంద్రా రోడ్డులో బాసినీగుడ కూడలి వద్ద అదుపు తప్పి బోల్తా పడింది. ఈ ప్రమాదంలో నిఖిల ఖిలో, త్రినాథ్‌లు తీవ్రంగా, ఆటో డ్రైవర్ స్వల్పంగా గాయపడ్డారు. ఏడేళ్ల చిన్నారి నిఖిల ఎడమ కాలుకి తీవ్ర గాయమైంది. త్రినాథ్ తల, భుజం, కాలుకి తీవ్ర గాయాలైనట్లు సమాచారం. క్షతగాత్రులను బొయిపరిగుడ కమ్యూనిటీ ఆస్పత్రిలో చేర్చారు. ప్రాథమిక చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం కొరాపుట్ సహిద్ లక్ష్మణ్ నాయిక్ వైద్య కళాశాల ఆస్పత్రికి తరలించారు.

సైకిల్ దొంగతనం కేసులో నిందితుడు అరెస్టు



దొంగిలించిన సైకిల్‌తో కిషోర్

జయపురం: ఒక సైకిల్ దొంగతనం కేసులో నిందితుడిని అరెస్టు చేసినట్లు జయపురం పట్టణ పోలీసు అధికారి సత్యానంద పాత్రో సోమవారం తెలియజేశారు. వివరాల్లోకి వెళ్తే.. ఈనెల 4వ తేదీన జయపురం భద్రయ్యా వీధిలో బి.సంతోష్ కుమార్ ఇంటివద్ద అతడి సైకిల్ దొంగిలించబడింది. దీంతో కుమార్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు వెల్లడించారు. ఈ కేసుని ఏఎస్ఐ విజయ కృష్ణ పట్నాయిక్ దర్యాప్తు జరిపి నిందితుడిని అరెస్టు చేశారన్నారు. అరెస్టైన వ్యక్తి జయపురం గోపబందు నగర్‌కు చెందిన పట్ల కిశోర్ కుమార్(53)గా వెల్లడించారు. నిందితుడి నుంచి అతడు దొంగిలించిన సైకిల్‌ను స్వాధీనం చేసుకొని, అతడిని కోర్టుకు తరలించారు.

తల్లి ఫిర్యాదుతో కటకటాల్లోకి కొడుకు

జయపురం: ఒక తల్లి తన కొడుకుపై పోలీసులకు ఫిర్యాదు చేయడంతో అతడు కటకటాల్లోకి వెళ్లిన ఘటన జయపురంలో చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళ్తే.. జయపురం పట్టణ పోలీసుస్టేషన్ పరిధి ఒడియా మేదరి వీధికి చెందిన ప్రమీళ పంగి తన కుమారుడు తనను కొట్టి తన వద్దనున్న డబ్బు తీసుకుపోయాడని పోలీసులకు ఫిర్యాదు చేయగా, అరెస్టు చేసినట్లు పట్టణ పోలీసు అధికారి సత్యానంద పాత్రో వెల్లడించారు. ప్రమీళ పంగి తన భర్త మరణించిన తర్వాత అష్టకష్టాలు పడుతూ కూలి పనులు చేస్తూ కుటుంబాన్ని నెట్టుకు వస్తోంది. అయితే కొడుకు ఎప్పుడూ తల్లితో గొడవ పడుతూ ఇబ్బందులకు గురిచేసేవాడు. అందుచేత ఆమె కొడుకు దగ్గర నుంచి వెళ్లిపోయి కొత్తవీధి 4వ లైన్‌లో ఉంటుంది. గత నెల 31వ తేదీన ఆమె గోపబందునగర్‌లో ఉంటున్న కుమార్తె ఇంటికి వెళ్లింది. కొన్ని రోజులు ఉండి తిరిగి వస్తున్న సమయంలో దారిలో ఆమె కుమారుడు మహేష్ పంగి కలిశాడు. అప్పుడు తల్లిని డబ్బులు అడగగా, లేవని చెప్పడంతో ఆమె వద్దనున్న రూ.250లు బలవంతంగా లాక్కునిపోయాడు. దీంతో ఆమె జయపురం పట్టణ పోలీసు స్టేషన్‌లో తన గోడు వినిపిస్తూ ఫిర్యాదు చేసింది. పోలీసులు కేసు నమోదు చేసి అతడిని అరెస్టు చేసి కోర్టుకు తరలించారు. అసిస్టెంట్ సబ్ ఇన్‌స్పెక్టర్ నవీన చౌదరి కేసు దర్యాప్తు జరుపుతున్నట్లు వెల్లడించారు.

జగన్నాథ ఆలయ మరమ్మతులపై వివరణ



భువనేశ్వర్: పూరీ శ్రీజగన్నాథ దేవాలయంలోని జగమోహన్, రత్న భాండాగారానికి మరమ్మతుల నేపథ్యంలో చేపట్టిన చర్యలపై సమగ్ర నివేదిక సమర్పించాలని ఒడిశా హైకోర్టు భారత పురావస్తు శాఖను ఆదేశించింది. జగమోహన్, రత్న భాండాగారం మరమ్మతులు, నిర్వహణ సవాలుతో దాఖలైన రెండు వేర్వేరు పిటిషన్లను విచారించిన అనంతరం హైకోర్టు తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తి బి.ఆర్.షడంగి ఈ ఉత్తర్వులు జారీ చేశారు. జగమోహన్, రత్న భాండాగారం మరమ్మతుల్లో ఎలాంటి పురోగతి కనిపించకపోవడాన్ని గమనించిన ఆయన, రెండు నిర్మాణాల మరమ్మతులకు 2017 సంవత్సరం నుంచి తీసుకున్న చర్యలపై భారత పురావస్తు శాఖ (ఏఎస్ఐ) నుంచి వివరాలు కోరారు. ఈ 2 పిటిషన్లపై తదుపరి విచారణను ఈనెల 8వ తేదీకి వాయిదా వేశారు. తదుపరి విచారణ నాటికి కోర్టు ఆదేశాల మేరకు నివేదిక సమర్పించాలని ఏఎస్ఐని ఆదేశించింది. మరమ్మతు పనులను త్వరగా పూర్తి చేసేందుకు అఫిడవిట్ సమర్పించాలని స్పష్టం చేసింది. జగమోహన్, నాట్య మండపం మరమ్మతుల పనులు పూర్తయ్యాయని జులై 10న భారత పురావస్తు శాఖ హైకోర్టుకు తెలిపింది. రత్న భాండాగారం తిరిగి తెరవడంపై ప్రత్యేక కమిటీని ఏర్పాటు చేసి మరమ్మతు పనులు చేపట్టాలని, అందులోని విలువైన వస్తువుల జాబితాను రూపొందించాలని ఈ ఏడాది ఆగస్టు 1న హైకోర్టు రాష్ట్ర ప్రభుత్వాన్ని ఆదేశించింది. బీజేపీ సీనియర్ నేత సమీర్ మహంతి దాఖలు చేసిన పిటిషన్‌ను విచారించిన అనంతరం కోర్టు ఈ మేరకు ఆదేశాలు జారీ చేసిన విషయం తెలిసిందే.

రత్న భాండాగారం తెరవాలి



జగన్నాథ మందిరం వద్ద నిరసన తెలుపుతున్న ప్రియదర్శన్ పట్నాయక్ తదితరులు

• జగన్నాథ సేన డిమాండ్

రాయగడ: పూరీలోని జగన్నాథ స్వామి మందిరంలో నాలుగు సింహ ద్వారాలతో పాటు రత్న భాండాగారం కూడా తెరవాలని జగన్నాథ సేన డిమాండ్ చేసింది. ఈ మేరకు పూరి నుంచి వచ్చిన జగన్నాథ సేన ప్రతినిధి (కన్వీనర్) ప్రియదర్శన్ పట్నాయక్ స్థానిక జగన్నాథ మందిరంలో భక్తులతో కలిసి మందిరం మెయిన్ గేటు వద్ద సోమవారం నిరసన వ్యక్తం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం సింహ ద్వారాలు, రత్న భాండాగారాన్ని తెరవడానికి ఎందుకు భయపడుతోందని ప్రశ్నించారు. జనవరిలోగా తెరవకపోతే రాష్ట్రంలోని జగన్నాథ భక్తులతో కలిసి ఆందోళన చేపట్టనున్నట్లు హెచ్చరించారు. పూరి పుణ్యక్షేత్రంలో మహాప్రభు జగన్నాథ, బలభద్ర, సుభద్ర దేవతామూర్తులను దర్శించుకునేందుకు ప్రపంచవ్యాప్తంగా వేలాది మంది భక్తులు నిత్యం వస్తుంటారని, కేవలం ఒకే ద్వారం తెరచి ఉండటంతో దర్శనానికి గంటల తరబడి నిరీక్షించాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చేందుకు రాష్ట్రంలోని అన్ని జగన్నాథ మందిరాలకు జగన్నాథ సేన ప్రతినిధులు వెళ్లి, నిరసన వ్యక్తం చేసే కార్యక్రమానికి శ్రీకారం చుట్టామని తెలియజేశారు. ఇప్పటికే గంజాం, ఖుర్ధా, కొరాపుట్ ప్రాంతాల్లో జగన్నాథ సేన ప్రతినిధులు చేరుకుని ప్రజా మద్దతును కోరడం జరిగిందని వివరించారు. కార్యక్రమంలో స్థానిక జగన్నాథ మందిరం కమిటీ సభ్యులు రంజన్ కుమార్ రాథో, బప్పి త్రిపాఠి తదితరులు పాల్గొన్నారు.

ఈ వారం చలి పెరుగుతుంది

భువనేశ్వర్: ఈ వారంలో చలి పెరుగుతుందని స్థానిక వాతావరణ శాఖ (ఐఎండీ) సోమవారం తెలిపింది. రాత్రిపూట కనిష్ట ఉష్ణోగ్రత 3 నుంచి 4 డిగ్రీల సెల్సియస్ తగ్గే అవకాశం ఉన్నట్లు ఈ శాఖ సమాచారం. రానున్న 24 గంటల్లో కనిష్ట ఉష్ణోగ్రతలో పెద్దగా మార్పులు ఉండవు. ఆ తర్వాత ఉష్ణోగ్రత 3 నుంచి 4 డిగ్రీల సెల్సియస్ తగ్గే అవకాశం ఉంది. గత 24 గంటల్లో రాష్ట్రంలో కొరాపుట్‌లో అత్యల్ప కనిష్ట ఉష్ణోగ్రత 13.2 డిగ్రీల సెల్సియస్ నమోదైంది. కొరాపుట్, రాయగడ, మల్కన్‌గిరి మరియు గజపతితో సహా రాష్ట్రంలోని దక్షిణ కోస్తా ప్రాంతాల్లోని అనేక జిల్లాల్లో మంగళవారం, సోమవారం తేలికపాటి నుంచి మోస్తరు వర్షం, ఉరుములతో కూడిన వాతావరణం నెలకొని ఉంటుందని వాతావరణ శాఖ తెలిసింది. రెండు రోజుల పాటు రాష్ట్రంలోని కొన్నిచోట్ల తేలికపాటి నుంచి ఓ మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని ఐఎండీ తెలిపింది. ఆ తర్వాత ఒడిశా అంతటా పొడి వాతావరణం నెలకొంటుంది.

ఆదివాసీల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

• మంత్రి జగన్నాథ సరక



కమ్యూనిటీ భవనాన్ని ప్రారంభిస్తున్న మంత్రి సరక

రాయగడ: ఆదివాసీల సంక్షేమమే బీజేడీ ప్రభుత్వ ధ్యేయమని రాష్ట్ర ఆదివాసీ, హరిజన సంక్షేమ శాఖ మంత్రి జగన్నాథ సరక అన్నారు. జిల్లాలోని బిసంకటక్ సమితి చంచాడగుడ పంచాయతీలోని చంచాడగుడ, బుటుగుడ, సొరగుడ, సువాగా గ్రామాల్లో ఒక్కొక్కటి చొప్పున్న నిర్మించిన మల్టీపర్పస్ కమ్యూనిటీ హాల్‌లను ఆదివారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. బిసంకటక్ సమితిలోని డొంగిరియా తెగకు చెందిన ఆదివాసీల అభ్యున్నతికి ప్రభుత్వం ఏర్పాటు చేసిన డొంగిరియా కొంధొ డవలప్‌మెంట్ ఏజెన్సీ ద్వారా అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతున్నట్లు తెలియజేశారు. ఈ క్రమంలో డొంగిరియాలు నివసించే గ్రామాల్లో వారి సౌకర్యార్థం నాలుగు మల్టీపర్పస్ కమ్యూనిటీ హాల్‌లను నిర్మించడం జరిగిందన్నారు. కార్యక్రమంలో బీజేడీ జిల్లా అధ్యక్షుడు సుధీర్ దాస్, బిసంకటక్ సమితి అధ్యక్షుడు యశోదా హుయిక, ఉపాధ్యక్షుడు దేవిప్రసాద్ పట్నాయక్, చంచాడగుడ సర్పంచ్ చంచలా వడక తదితరులు పాల్గొన్నారు.

డ్రంక్ అండ్ డ్రైవ్‌లో 18 మంది అరెస్టు



సెన్సేటు ప్రాంతంలో వాహన సోదాలు చేస్తున్న పోలీసులు

బరంపురం: నగరంలో ఆదివారం అర్ధరాత్రి వరకు పోలీసులు డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు నిర్వహించారు. అదేవిధంగా నగర ఫస్ట్‌గేట్ ప్రాంతంలో వాహన తనికీలు నిర్వహించారు. అనుమానం గల వాహనాలను దగ్గరున్న పెద్ద బజార్ పోలీసుస్టేషన్‌కి తరలించారు. డ్రంక్ అండ్ డ్రైవ్‌లో కేసుల్లో 18 మంది నిందితులను అరెస్టు చేసి, సోమవారం కోర్టుకి తరలించారు.



ఫస్ట్‌గేట్ ప్రాంతంలో కారులో తనికీలు నిర్వహిస్తున్న దృశ్యం



పెద్ద బజార్ పోలీసుస్టేషన్‌కి తరలించిన వాహనాలు

భారీగా గంజాయి స్వాధీనం

బరంపురం: గంజాం పోలీసు జిల్లా పరిధి 16వ నంబర్ జాతీయ రహదారి నుంచి కారులో అక్రమంగా బరంపురం వైపునకు తరలిస్తున్న 315 కిలోల గంజాయిని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఎస్పీ జగ్‌మోహన్ మీన తెలిపిన వివరాల మేరకు.. జిల్లాలోని కళ్లికోట్ దగ్గర 16వ నంబర్ జాతీయ రహదారి నుంచి బరంపురం వైపునకు వస్తున్న ఒక హూండా సిటీ కారులో అక్రమంగా గంజాయి రవాణా అవుతున్నట్లు పోలీసులకు ముందుగా సమాచారం వచ్చింది. దీంతో బరంపురం ఎక్సైజ్ అధికారులు జాతీయ రహదారిలో తనిఖీలు నిర్వహించారు. ధనుంజయ్‌పూర్ దగ్గర జాతీయ రహదారిలో పెట్రోల్ బంకు దగ్గర కారులో తనిఖీలు నిర్వహించి 11 బస్తాల్లో 315 కిలోల గంజాయితో పాటు హూండా సిటీ కారుని సీజ్ చేసి ఇద్దరిని అరెస్టు చేశారు. అరెస్టైనవారిలో గంజాం జిల్లాకి చెందిన రబింద్ర నాయక్, ప్రశాంత్ ప్రధాన్‌లు ఉన్నట్లు తెలియజేశారు.

రాయగడ: అక్రమంగా గంజాయిని తరలిస్తున్న ఇద్దరు వ్యక్తులను జిల్లాలోని పద్మపూర్ పోలీసులు పట్టుకుని, వారి నుంచి 13 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. పద్మపూర్ పోలీసులు తెలియజేసిన వివరాల మేరకు.. ఆదివారం సాయంత్రం పద్మపూర్ పోలీస్‌స్టేషన్ పరిధి నారాయణపూర్ ప్రాంతంలో పెట్రోలింగ్ చేస్తున్న సమయంలో రెస్ట్ షెడ్‌లో ఇద్దరు వ్యక్తులు అనుమానాస్పదంగా కనిపించారు. దీంతో వారిని అదుపులోకి తీసుకొని తనిఖీలు నిర్వహించగా రెండు బ్యాగుల్లో 13 కిలోల గంజాయి పట్టుబడింది. దీంతో వారిని అరెస్టు చేసి సోమవారం కోర్టుకు తరలించినట్లు ఎస్ఐ ఎన్.బెహర తెలియజేశారు.

జయపురం: కొరాపుట్ జిల్లా మాచ్‌ఖండ్ పోలీసులు ఒక కారుతో పాటు 101 కేజీల గంజాయిని సీజ్ చేసినట్లు మాచ్‌ఖండ్ పోలీసు అధికారి డొంబురుదొర బత్రియ తెలియజేశారు. గంజాయి రవాణా చేస్తున్న వ్యక్తులు కారులో గంజాయి విడిచి పరారయ్యారని వెల్లడించారు. పట్టుబడిన గంజాయి విలువ సుమారు రూ.10 లక్షలకు పైనే ఉంటుందన్నారు.



జయపురం: పట్టుబడిన గంజాయి బస్తాలు



జయపురం: సీజ్ చేసిన కారు

ఒక కారులో గంజాయి తరలిస్తున్నట్లు ముందుగా సమాచారం అందడంతో బదలిగుడ అటవీ సమీపంలో వాహన తనిఖీలు నిర్వహించారు. ఈ సమయంలో అతివేగంగా వస్తున్న కారును ఆపడానికి ప్రయత్నించగా నిందితులు కారును నిలిపివేసి పారిపోయారు. పోలీసులు అనుమానంతో కారులో సోదాలు చేయగా 5 బస్తాలతో గంజాయి కనిపించింది. పోలీసులు కారుతో పాటు గంజాయిని స్టేషన్‌కు తీసుకొచ్చి మేజిస్ట్రేట్ ముందు తూయించగా 101 కేజీలు ఉన్న ట్లు వెల్లడించారు. కారుకు నకిలీ నంబర్ ప్లేట్ తగిలించి గంజాయి రవాణా చేస్తున్నట్లు పేర్కొన్నారు. గంజాయి మాఫియా వ్యక్తులను త్వరలోనే పట్టుకుంటామని తెలియజేశారు.



రాయగడ: గంజాయితో పట్టుబడిన నిందితులు



బరంపురం: సీజ్ చేసిన గంజాయితో పాటు అరెస్టు చేసిన వ్యక్తులను చూపిస్తున్న పోలీసులు

క్లుప్తంగా

జిల్లా స్థాయి పోటీల్లో విద్యార్థుల ప్రతిభ


విద్యార్థినికి ప్రశంసాపత్రం అందజేస్తున్న దృశ్యం

జయపురం: ఇటీవల సునాబెడలో నిర్వహించిన జిల్లాస్థాయి క్రీడా పోటీల్లో స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులు ప్రతిభ కనబర్చారు. పదో తరగతి విద్యార్థి సంతోషి జాని డిస్కస్ త్రోలో ప్రథమ స్థానం, షాట్‌పుట్‌లో తృతీయ స్థానం సాధించాడు. విద్యార్థిని పుష్పాంజలి ప్రధాన్ జావెలిన్ త్రోలో తృతీయ స్థానం సాధించింది. అలాగే జూనియర్స్‌లో విద్యార్థిని నందినీ సాహు డిస్కస్ త్రోలో ప్రథమ స్థానం, షాట్‌పుట్ త్రోలో తృతీయ స్థానంలో నిలిచింది. విజేతలైన విద్యార్థులు పాఠశాల సిబ్బంది అభినందించారు.

సీఎం సహాయ నిధి అందజేత


సమస్యలు వింటున్న అధికారులు

పర్లాకిమిడి: నలుగురు నిస్సహాయకులకు సీఎం సహాయ నిధి రూ.25 వేల చొప్పున అధికారులు అందజేశారు. స్థానిక జిల్లా కలెక్టర్ కార్యాలయంలో సోమవారం గ్రీవెన్సు సెల్ కార్యక్రమం జిల్లా పాలనాధికారి స్మృతి రంజన్ ప్రధాన్ మరియు ఎస్పీ స్వాతి ఎస్.కుమార్ ఆధ్వర్యంలో జరిగింది. ఈ గ్రీవెన్సు సెల్‌కు పర్లాకిమిడితో పాటు సిద్ధమణుగు, కత్తల కవిటి, రాణిపేట, బాగుసల గ్రామాల నుంచి 37 వినతులు అందాయి. వాటిలో వ్యక్తిగతం 26 కాగా, గ్రామ సమస్యలు 11 ఉన్నాయి. వీటిలో 5 వినతులను అక్కడికక్కడే అధికారులు పరిష్కరించారు. కార్యక్రమానికి జిల్లాలోని ఆర్‌అండ్‌బీ, మెడికల్, వ్యవసాయ, జిల్లా గ్రామీణాభివృద్ధి, ఐటీడీఏ తదితర శాఖల అధికారులు హాజరయ్యారు.

అంతర్ వర్సిటీ పోటీలకు జీఎంఆర్ ఐటీ విద్యార్థి

రాజాం సిటీ: ఈ నెల 9 నుంచి 12 వరకు జేఎన్‌టీయూ కాకినాడలో జరగనున్న అంతర్ విశ్వ విద్యాలయాల కబడ్డీ పోటీలకు స్థానిక జీఎంఆర్ ఐటీ విద్యార్థి ఇ.సూర్యప్రకాశ్ ఎంపికయ్యాడని పీడీ బీహెచ్ అరుణ్‌కుమార్ సోమవారం తెలిపారు. ఇటీవల విశాఖపట్నంలోని విజ్ఞాన్ ఇంజినీరింగ్ కళాశాలలో నిర్వహించిన ఈ పోటీలలో జేఎన్‌టీయూ జీవీ విజయనగరం తరపున పాల్గొని ఎంపికయ్యాడని చెప్పారు. విద్యార్థి ఎంపికపట్ల ప్రిన్సిపాల్ డాక్టర్ సీఎల్‌వీ ఆర్‌ఎస్‌వీ ప్రసాద్, ఎడ్యుకేషన్ డైరెక్టర్ డాక్టర్ జె.గిరీష్, డీన్‌లు ఎంవీ నాగేశ్వరరావు, వి.రాంబాబు, విద్యార్థులు హర్షం వ్యక్తం చేశారు.

120 లీటర్ల సారాతో వ్యక్తి అరెస్టు

పార్వతీపురంటౌన్: మండలంలోని ఆర్‌కె బట్టివలస గ్రామ సమీపంలో ఎస్‌ఈబీ సీఐ ఉపేంద్ర సోమవారం తనిఖీలు నిర్వహించి 120లీట్ల సారా, బైక్‌ను స్వాధీనం చేసుకుని ఓ నిందితుడిని అరెస్ట్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఒడిశా రాష్ట్రం నుంచి పార్వతీపురం పట్టణానికి సారా రవాణా చేస్తున్నారన్న సమాచారం మేరకు దాడులు నిర్వహించామని తెలిపారు. పార్వతీపురం మున్సిపాల్టీలోని రెల్లివీధికి చెందిన శ్రీకాంత్, సొండి సురేష్‌లు ఒడిశా సరిహద్దు గ్రామాల నుంచి సారా రవాణా చేస్తుండగా వారి నుంచి 120 లీటర్ల సారా, బైక్ స్వాధీనం చేసుకున్నామని చెప్పారు. అయితే సొండి సురేష్ పరారీలో ఉన్నాడని, సాధ్యమైనంత త్వరలో అరెస్టు చేస్తామన్నారు. శ్రీకాంత్‌పై కేసు నమోదు చేసి రిమాండ్ నిమిత్తం జ్యుడీషియల్ మెజిస్ట్రేట్ ముందు హాజరు పరిచామని తెలిపారు. దాడుల్లో ఎస్సై రమణ, సిబ్బంది పాల్గొన్నారు.

గొట్టివలసలో ఏనుగుల గుంపు

గరుగుబిల్లి: మండలంలోని గొట్టివలస పరిసరాల్లో సోమవారం ఏనుగులు సంచరించింది. పదిహేనురోజుల నుంచి గొట్టివలస, గరుగుబిల్లి, దళాయి వలస, పెద్దూరు తదితర గ్రామాల పరిధిలో ఏనుగుల గుంపు సంచరిస్తోంది. ఆయా గ్రామాల్లోని పంట పొలాల్లో సంచరించి పంటలను ధ్వంసం చేస్తున్నాయి. ఏనుగులు ప్రధాన రహదారిని ఆనుకుని సంచరిస్తుండడంతో ప్రజలు రాకపోకలు చేసేందుకు భీతిల్లుతున్నారు. ఏనుగులను ఈ ప్రాంతం నుంచి తరలించేందుకు అధికారులు చర్యలు చేపట్టాలని రైతులు కోరుతున్నారు.

గురుకులంలో టీచర్ అవతారమెత్తిన పీవో

సీతంపేట: మండలంలోని మల్లి గిరిజన గురుకుల బాలుర పాఠశాలను ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి కల్పనాకుమారి సోమవారం సందర్శించారు. కలెక్టర్ నిషాంత్‌కుమార్ జిల్లాలోని పలు పాఠశాలలకు దత్తత అధికారులను నియమించడంలో భాగంగా మల్లి పాఠశాలను ఆమె పరిశీలించి ఉపాధ్యాయిని అవతారమెత్తారు. వివిధ సబ్జెక్టులలో విద్యార్థులకు పలు అంశాలపై ప్రశ్నలు వేసి సమాధానాలు రాబట్టారు. పబ్లిక్ పరీక్షలు సమీపిస్తున్నందున బాగా చదువుకోవాలని విద్యార్థులకు, చదువులో వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని ఉపాధ్యాయులకు సూచించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ వాసుదేవరావు తదితరులు పాల్గొన్నారు.

గృహ నిర్మాణాల జాప్యంపై అసంతృప్తి


సమీక్ష సమావేశం నిర్వహిస్తున్న దృశ్యం

జయపురం: ప్రధానమంత్రి ఆవాస్ యోజన పథకంలో భాగంగా లబ్ధిదారులు ఇళ్ల నిర్మాణంలో జరుపుతున్న జాప్యంపై మున్సిపల్ సమావేశంలో అసంతృప్తి వ్యక్తమయ్యింది. 2017 నుంచి ప్రారంభించిన ఆవాస్ యోజన పథకంపై సమీక్ష సమావేశం సోమవారం నిర్వహించారు. ఇప్పటివరకు 279 మంది లబ్ధిదారులకు గృహ నిర్మాణాలపై ఆదేశాలు జారీ చేసినా పనులు ప్రారంభించలేదన్నారు. అందువలన ప్రభుత్వ నిబంధనలు ప్రకారం 15 రోజుల్లో పనులు ప్రారంభించి, 6 నెలల్లో నిర్మాణ పనులు పూర్తి చేయాలని నోటీసులు జారీ చేయాలని నిర్ణయించింది. నిర్మాణ పనులు ప్రారంభించకుంటే గృహ నిర్మాణ ఆదేశాలను రద్దు చేయాలని సమావేశం తీర్మానించింది. 2017 నుంచి ఇప్పటివరకు జయపురం మున్సిపాలిటీలో 3,407 మంది లబ్ధిదారులకు పీఎంఏవై గృహాల నిర్మాణానికి నిధులు మంజూరు చేసినట్లు వెల్లడించారు. వారిలో 2,183 మంది గృహాలు నిర్మించుకున్నారని, 945 మంది నిర్మాణాలు చేపడుతున్నారని, మిగతా 279 మంది నేటికీ నిర్మాణ పనులు ప్రారంభించలేదని పేర్కొన్నారు. నిర్మాణాలు చేపట్టకుంటే గృహాల మంజూరును రద్దు చేస్తామనే విషయాన్ని మైక్ ద్వారా ప్రజలకు తెలియజేయాలని నిర్ణయించారు. జయపురం మున్సిపల్ చైర్మన్ నరేంద్ర కుమార్ మహంతి అధ్యక్షతన జరిగిన సమావేశంలో కార్యనిర్వాహక అధికారి సిద్ధార్థ పట్నాయక్, హెడ్‌క్లర్క్ గోపాల సాహు, కౌన్సిలర్ ప్రభ కిశోర్ నాయిక్ తదితరులు పాల్గొన్నారు.

చైతన్య రథం ప్రారంభం


చైతన్య రథాన్ని ప్రారంభిస్తున్న కలెక్టర్ సింగ్ తదితరులు

రాయగడ: జిల్లాలో కాసీపూర్ సమతి టికిరిలోని ఉత్కళ అలూమని కర్మాగారం, జిల్లా ఆరోగ్య శాఖ సంయుక్తంగా సికిల్ సెల్‌పై అవగాహన, చైతన్య కార్యక్రమానికి సోమవారం నాంది పలికాయి. కలెక్టర్ స్వాదాదేవ్ సింగ్, జిల్లా ముఖ్యవైద్యాధికారి డాక్టర్ లాల్ మోహన్ రౌత్రాయ్, కర్మాగారం యూనిట్ ఇన్‌చార్జి మజూర్ బేగ్‌లు ప్రచార రథాన్ని పచ్చజెండా ఊపి ప్రారంభించారు. సికిల్ సెల్ వ్యాధి బారిన పడిన ఎంతో మంది అనేక ఇబ్బందులు పడుతున్నారని, అందుకు ఆ వ్యాధిపై సరైన అవగాహన లేకపోవడమే కారణమని జిల్లా ముఖ్యవైద్యాధికారి డాక్టర్ లాల్ మోహన్ రౌత్రాయ్ అన్నారు. వ్యాధి సోకే లక్షణాలు ముందుగా తెలుసుకోగలిగితే వ్యాధి నివారణ సులభతరం అవుతుందన్నారు. అందుకు సకాలంలో స్క్రీనింగ్ పరీక్షలు తప్పనిసరి అన్నారు. కర్మాగారం యూనిట్ ఇన్‌చార్జి మజూర్ బేగ్ మాట్లాడుతూ ఈ వ్యాధి నివారణకు సంబంధించి సన్నాహాలు చేస్తున్నామని తెలిపారు. కాసీపూర్ సమితిలోని ప్రతీ ప్రాంతంలో వ్యాధి గురించి ప్రజలకు అవగాహన కల్పించేందుకు చైతన్య రథం ప్రచారాన్ని కొనసాగిస్తుందన్నారు. అదేవిధంగా త్వరలో తమ కర్మాగారం తరుపున స్క్రీనింగ్ పరీక్షల సౌకర్యాన్ని కల్పిస్తామని వెల్లడించారు.

జర్నలిస్టుల అరెస్టుపై నిరసన


ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

పర్లాకిమిడి: అక్టోబర్ 3వ తేదీన న్యూఢిల్లీలో న్యూస్ క్లిక్ ఆన్‌లైన్ ఎడిషన్ పేపర్‌పై ఈడీ, పోలీసులు దాడులు చేసి ఆరుగురు జర్నలిస్టులను అరెస్టు చేయడంపై సీపీఎం జిల్లా అధ్యక్షుడు దండపాణి రైయితో, సీపీఎం (లిబరేషన్) నాయకుడు శ్రీనివాస బెహరాలు మండిపడ్డారు. ఈ మేరకు స్థానిక సీపీఎం కార్యాలయం నుంచి కళాశాల జంక్షన్ వరకు నిరసన ర్యాలీ సోమవారం చేపట్టారు. ఈ సందర్భంగా రైయితో మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం జర్నలిస్టులపై అన్యాయంగా కేసులు మోపి అరెస్టు చేయిస్తోందని ఆందోళన వ్యక్తం చేశారు. కేంద్ర ప్రభుత్వం రైతులపై కూడా లాఠీచార్జి చేసిన విషయాన్ని గుర్తు చేశారు. ఆందోళనలో ఒడిశా కృషక మహాసభ జిల్లా కమిటీ నాయకులు యం.బంగారీ, అల్యాన భాస్కరరావు, కె.సంజీవి, శకుంతల రైయితో తదితరులు పాల్గొన్నారు.

మహిళ ఆత్మహత్యాయత్నం

పార్వతీపురంటౌన్: కురుపాం మండలంలోని జోగిరాజుపేట గ్రామంలో ఓ మహిళ పురుగు మందు తాగి ఆత్మహత్యా యత్నం చేసింది. ఈ సంఘటనపై పార్వతీపురం జిల్లా ఆస్పత్రి అవుట్‌పోస్టు పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. ఒకే గ్రామానికి చెందిన రావివలస కోమలి, ప్రవీణ్‌లకు వివాహమై 12 సంవత్సరాలు పూర్తయ్యింది. వారికి ఇద్దరు పిల్లలు ఉన్నారు. కోమలిపై భర్తకు అనుమానం ఉండడంతో నిత్యం వేధిస్తున్నాడు. కొద్ది రోజులుగా ఆమెను కొట్టడం, తిట్టడం ఎక్కువ కావడంతో మనస్తాపం చెంది పురుగు మందు తాగేసింది. ఈ విషయం తెలుసుకున్న భర్త కురుపాం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించాడు. ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం నిమిత్తం 108 వాహనంలో పార్వతీపురం జిల్లా ఆస్పత్రికి తీసుకువచ్చారు. ఈ ఘటనపై అవుట్‌పోస్టు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపడుతున్నారు.

మరో విద్యార్థిని..

జియ్యమ్మవలస మండలం బొడ్డవలస గ్రామంలో సోమవారం ఓ విద్యార్థిని ఆత్మహత్యా యత్నం చేసింది. ఈ ఘటనపై జిల్లా ఆస్పత్రి అవుట్‌పోస్టు పోలీసులు తెలిపిన వివరాలిలాఉన్నాయి. గ్రామానికి చెందిన కొండగొర్రి అఖిల బొబ్బిలిలోని లక్ష్మమ్మ ఒకేషనల్ కళాశాలలో ఎంపీహెచ్‌డబ్ల్యూ గ్రూప్ రెండోసంవత్సరం చదువుతోంది. ఆమె స్నేహితురాలు మండంగి మాధురికి నాలుగు నెలల క్రితం తన బంగారు చెవి రింగులు ఇచ్చింది. ఈ మధ్య అఖిల తల్లి చెవి రింగుల గురించి అడగ్గా స్నేహితురాలికి ఇచ్చానని చెప్పింది. అయితే వెళ్లి తీసుకురా అని తల్లి డిమాండ్‌చేయడంతో మాధురికి ఫోన్ చేసి అడగ్గా ఇస్తానని చెప్పి ఇవ్వకుండా విశాఖపట్నం వెళ్లిపోయింది. దీంతో విశాఖపట్నం వెళ్లి మాధురిని చెవిరింగులు అడగ్గా నేనివ్వను ఎవరితో చెప్పుకుంటావు చెప్పుకో అని బెదిరించింది. ఈ క్రమంలో ఇంట్లో మందలిస్తారన్న భయంతో ఆందోళన చెందిన అఖిల పురుగు మందు తాగేసింది. తల్లిదండ్రులు గమనించి 108 వాహనంలో పార్వతీపురం జిల్లా ఆస్పత్రికి తరలించారు.

సమస్యలు పరిష్కరించాలని వినతి


సమస్యను తెలియజేయడానికి వచ్చిన మహిళలు


వినతులు స్వీకరిస్తున్న కలెక్టర్ సింగ్, ఇతర అధికారులు

రాయగడ: స్థానిక చెక్కాగుడ ప్రాంతంలోని జుల్లావీధిలో నివాసముంటున్న 46 కుటుంబాలకు చెందిన మహిళలు తమ సమస్యలను పరిష్కరించాలని కోరారు. ఈ మేరకు స్థానిక డీఆర్‌డీఏ సమావేశ మందిరంలో కలెక్టర్ స్వాదాదేవ్ సింగ్ నేతృత్వంలో సోమవారం జరిగిన వినతుల స్వీకరణ కార్యక్రమంలో తమ గోడును వినిపించారు. ఏళ్ల తరబడి అక్కడ నివసిస్తున్నా ఇంతవరకు ప్రభుత్వం తమకు ఇళ్ల పట్టాలు పంపిణీ చేయలేదన్నారు. అదేవిధంగా కనీస మౌలిక వసతులు కల్పించడం లేదని వాపోయారు. దీంతో స్పందించిన కలెక్టర్ సమస్యను పరిష్కరించేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. అలాగే స్థానిక పిట్టల వీధిలో నివసిస్తున్న మగవాపు సంతోష్‌కుమార్ లివర్ ట్రాన్స్‌ప్లాంటేషన్ చేయాలని డాక్టర్లు సూచించడంతో ఆర్థిక సాయం కోసం సంతోష్ తండ్రి శంకరరావు, అతని భార్య కలిసి కలక్టర్ దృష్టికి సమస్యను తీసుకువెళ్లడంతో, జిల్లా ముఖ్యవైద్యాధికారి డాక్టర్ లాల్ మోహన్ రౌత్రాయ్ పరిశీలించిన మీదట ప్రభుత్వం తరుపున తగు ఆర్థిక సాయం అందేలా చర్యలు తీసుకుంటామని భరోసా ఇచ్చారు. వినతుల స్వీకరణకు మొత్తం 56 వినతులు అందగా, వీటిలో 43 వ్యక్తిగత సమస్యలు కాగా, 13 గ్రామ సమస్యలుగా అధికారులు గుర్తించారు.

సీనియర్స్ బాక్సింగ్ పోటీలకు 13 మంది ఎంపిక

- 13 నుంచి విశాఖలో రాష్ట్రస్థాయి పోటీలు


రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన క్రీడాకారులతో బాక్సింగ్ అసోసియేషన్ ప్రతినిధులు

విజయనగరం: రాష్ట్రస్థాయిలో జరగనున్న సీనియర్స్ పురుషుల బాక్సింగ్ పోటీల్లో పాల్గొనబోయే జిల్లా క్రీడాకారుల ఎంపిక పోటీలు సోమవారం హోరాహోరీగా సాగాయి. నగరంలోని రాజీవ్ క్రీడామైదానం ప్రాంగణంలో గల బాక్సింగ్ హాల్‌లో జిల్లా బాక్సింగ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఎంపిక పోటీల్లో 50 మంది తలపడ్డారు. మొత్తం 13 కేటగిరీల బరువుల్లో నిర్వహించిన ఎంపిక పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన 13 మంది క్రీడాకారులను రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక చేశారు. జిల్లా స్థాయి ఎంపిక పోటీల్లో అర్హత సాధించిన క్రీడాకారులు ఈనెల 13 నుంచి 15వ తేదీ వరకు విశాఖలో గల స్వర్ణభారతి ఇండోర్‌స్టేడియంలో జరగనున్న అంతర్ జిల్లాల బాక్సింగ్ పోటీల్లో పాల్గొంటారని బాక్సింగ్ అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు డోలా మన్మథకుమార్ తెలిపారు. ఎంపిక పోటీలను శాప్ బాక్సింగ్ కోచ్ బి.ఈశ్వరరావు, బాక్సింగ్ అసోసియేషన్ సభ్యులు ఎస్‌ఈ రాజు, రింగ్ ఆఫీషియల్స్ వి.సంతోష్‌కుమార్, పి.శ్రీనివాసరావు, పి.రామకృష్ణ తదితరులు పర్యవేక్షించారు.

రాష్ట్రస్థాయి యోగా పోటీల్లో విద్యార్థి ప్రతిభ


విద్యార్థిని అభినందిస్తున్న ఉపాధ్యాయులు

పార్వతీపురంటౌన్: రాష్ట్రస్థాయి యోగా పోటీల్లో పార్వతీపురం నియోజకవర్గం విద్యార్థి ప్రతిభ కనబరిచినట్లు మండలంలోని తాళ్లబురిడి జెడ్పీ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు అరుంధతి తెలిపారు. ఈ మేరకు సోమవారం ఆమె రాష్ట్రస్థాయి యోగా పోటీల్లో ప్రతిభ కనబరిచిన వండాన రోహిత్‌ను అభినందించారు ఈ సందర్భంగా మాట్లాడుతూ ఈనెల 1,2,3 తేదీల్లో పశ్చిమ గోదావరి జిల్లాలో నిర్వహించిన రాష్ట్రస్థాయి రిథమిక్ యోగా పోటీల్లో రోహిత్ అండర్-14 విభాగంలో రజతపతకం సాధించాడని చెప్పారు. రానున్న రోజుల్లో మరిన్ని పతకాలు సాధించి జిల్లాకు పేరు ప్రఖ్యాతులు తీసుకురావాలని ఆకాంక్షించారు.

వెబ్‌సైట్‌లో జీడీఏ పోస్టుల తుది జాబితా

విజయనగరం ఫోర్ట్: జిల్లా ఆస్పత్రుల సేవల సమన్వయాధికారి వారి పరిధిలో ఖాళీగా ఉన్న ఆడియో మెట్రిసిన్, జనరల్ డ్యూటీ అటెండెంట్(జిడిఏ), ఆఫీస్ సబార్డినేట్ పోస్టులకు సంబంధించి ఫైనల్ జాబితాను విజయనగరం.ఏపీ.జీఓవీ.ఇన్ వెబ్‌సైట్‌లో పొందుపరిచినట్లు డీసీహెచ్‌ఎస్ బి.గౌరీ శంకర్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపికైన అభ్యర్థులు ఈనెల 9వతేదీన ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిలో ఉన్న డీసీహెచ్‌ఎస్ కార్యాలయంలో ఉదయం 10 గంటలకు అన్ని ఒరిజనల్ సర్టిఫికెట్లతో హాజరుకావాలని స్పష్టం చేశారు.

యూనియన్ బ్యాంక్ అవగాహన ర్యాలీ


ర్యాలీ చేస్తున్న యూనియన్ బ్యాంక్ ఉద్యోగులు

విజయనగరం అర్బన్: అవినీతి చర్యలను వ్యతిరేకిస్తూ పట్టణ వీధుల్లో యూనియన్ బ్యాంక్ సిబ్బంది ఆదివారం భారీ ర్యాలీ నిర్వహించారు. అవినీతి, లంచగొండితనంపై ప్రజల్లో అవగాహన కల్పించాలనే లక్ష్యంతో పట్టణంలోని కోట జంక్షన్ నుంచి మూడు లాంతర్ల కూడలి మీదుగా గంటస్తంభం వరకు ర్యాలీ చేపట్టారు. 'సే నో టు కరెప్షన్' బ్యానర్, ప్లకార్డ్స్‌తో ర్యాలీలో నినాదాలు చేశారు. అదేవిధంగా సేవా కార్యక్రమంలో భాగంగా రెడ్‌క్రాస్ సొసైటీ నిర్వహించిన శిబిరంలో పలువురు ఉద్యోగులు రక్తదానం చేశారు. కార్యక్రమంలో యూనియన్ బ్యాంక్ రీజనల్ హెడ్ పి.నరేష్, డిప్యూటీ రీజనల్ హెడ్ మాధురి, విజిలెన్స్ అఫీసర్ ఐ.వెంకటకృష్ణ, బ్యాంక్ ఉద్యోగులు పాల్గొన్నారు.

రూ.4.5 కోట్లు పైబడి డ్వాక్రా బజార్ అమ్మకాలు


సేంద్రియ ఎరువుల పంట ఉత్పత్తుల ప్రదర్శన


జూట్ నుంచి తయారు చేసిన గృహోవసరాల వస్తువులు

విజయనగరం అర్బన్: డీఆర్‌డీఏ ఆధ్వర్యంలో పట్టణంలోని అంబేడ్కర్ జంక్షన్ వద్ద నిర్వహిస్తున్న అఖిలభారత డ్వాక్రా బజార్‌లో పొదుపు మహిళల ఉత్పత్తులకు డిమాండ్ రోజురోజుకూ పెరుగుతోంది. డ్వాక్రా బజార్‌లో ఇంతవరకు రూ.4.5 కోట్లు దాటి వ్యాపారం జరిగిందని డీఆర్‌డీఏ పీడీ ఎ.కల్యాణ చక్రవర్తి సోమవారం తెలిపారు. ముందుగా నిర్ణయించిన షెడ్యూల్ ప్రకారం మరో రెండు రోజుల్లో ప్రదర్శన ముగుస్తుందని చెప్పారు. 15 రాష్ట్రాల పొదుపు సంఘాల ఉత్పత్తులతో పాటు జిల్లాకు చెందిన మెంటాడ, ఎల్.కోట, నెల్లిమర్ల, డెంకాడ, వంగర, చీపురుపల్లి, సంతకవిటి, గుర్ల, గంట్యాడ, నెల్లిమర్ల, గజపతినగరం, విజయనగరం మున్సిపాలిటీల నుంచి తినుబండారాలు, హస్తకళలు, ఆభరణాలు, భీమాళి మామిడి తాండ్ర, రెడీమేడ్ దుస్తులు, అగరవత్తులు, పూజాసామగ్రి, ఎంటీపీ స్టిక్స్ (తుడుపు కర్రలు) తదితర ఉత్పత్తులకు సంబంధించిన స్టాల్స్‌లో అమ్మకాల తాకిడి పెరుగుతోంది.

అందివచ్చిన శ్రీధృతి

ఈ ఏడాది ఖరీఫ్ వరి పంట కాస్తా ముందుగానే కోతకు వచ్చింది. కొత్త రకం వరి వంగడాన్ని రైతులు సాగు చేశారు. గతంలో 1001 రకం వినియోగించే రైతులు ఈ దఫా ప్రభుత్వ చొరవతో శ్రీధృతిని సాగులోకి తీసుకొచ్చారు. 130 రోజుల వ్యవధిలో చేతికందే ఈ పంట సకాలంలో అందివచ్చింది. ప్రస్తుతం జిల్లా వ్యాప్తంగా అన్ని ప్రాంతాల్లో పంట కోత దశకు చేరుకుంది.

- కోత దశలో ఖరీఫ్ వరి
- జిల్లా వ్యాప్తంగా ఈ ఏడాది 2.26 లక్షల ఎకరాల్లో వరి సాగు
- ఇందులో 1.70 లక్షల ఎకరాల్లో శ్రీధృతి
- పెద్దహారం కట్టి ఆశాజనకంగా దిగుబడి
- మూడు నెలల్లో కోత దశకు వచ్చిన పంట
- ఎకరాకు 25 క్వింటాళ్ల దిగుబడి వచ్చే అవకాశం


నందబలగ సమీపంలో శ్రీధృతి సాగు

రాజాం: ఈ ఏడాది మంచి నాణ్యతతో పాటు అధిక దిగుబడి ఇచ్చే వరి వంగడాలను వ్యవసాయ శాఖ అందుబాటులోకి తీసుకొచ్చింది. వీటిలో ఎంటీయూ - 1121(శ్రీధృతి), బీపీటీ - 3291(సోనామసూరి), ఎంటీయూ - 1064(అమర), ఎంటీయూ - 7029(స్వర్ణ), బీపీటీ - 5204(సాంబమసూరి), ఎన్ఎల్ఆర్(నెల్లూరు సన్నాలు), ఆర్‌జీఎల్ - 2537, ఎంటీయూ - 1224 తదితర రకాల వరి విత్తనాలు ఇటు ఆర్‌బీకేలకు, అటు ప్రైవేట్ డీలర్ల వద్దకు వచ్చాయి. వీటిని రైతులు కొనుగోలు చేసి ఈ ఏడాది ఖరీఫ్‌లో సాగు ప్రారంభించారు. వీటిలో అత్యధికంగా ఎంటీయూ-1121(శ్రీధృతి) రకం వరి పంటను వేశారు. జిల్లా వ్యాప్తంగా ఈ ఏడాది 2,24,399 ఎకరాలు ఖరీఫ్ వరి సాగు లక్ష్యం కాగా, రైతులు 2,26,734 ఎకరాల్లో సాగును పెంచారు. ఇందులో 1,70,050 ఎకరాల్లో అత్యధికంగా శ్రీధృతిని 76 శాతం మేర సాగు చేస్తున్నారు.

ఆశాజనకంగా పంట

ప్రస్తుతం శ్రీధృతి పంట ఆశాజనకంగా కనిపిస్తుంది. పంట కోత దశకు చేరుకుంది. హారం ఎక్కువగా పట్టడంతో ఎకరా సాగులో 25 క్వింటాళ్లు దాటి దిగుబడి ధాన్యం వస్తాయని రైతులు ఆశిస్తున్నారు. ప్రస్తుతం ప్రభుత్వ మద్దతు ధర క్వింటా సాధారణ రకం రూ.2140 లు పలుకుతుంది. ఈ లెక్కన చూస్తే ఎకరాలో రైతుకు రూ.50 వేల వరకూ ధాన్యం విక్రయాలు జరుగుతాయి. ఇందులో పెట్టుబడులు ఎకరాకు రూ.18 వేల మేర తీసినా ఆదాయం రూ.30 వేలు దాటి ఉంటుంది. అంతేకాకుండా రైతు భరోసా సాధారణ రైతుకు 13,500లు రావడంతో పెట్టుబడులు కూడా కలసి వస్తాయి. ఇవి కాకుండా రబీలో అపరాలు సాగు రైతుకు కలసి వచ్చేలా ఉంది. మరో వైపు శ్రీధృతి ధాన్యం సన్నగా ఉండడంతో వీటికి బయట మార్కెట్‌లో కూడా డిమాండ్ ఉంటుందని రైతులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

జిల్లాలో ఈ ఏడాది సాగు చేసిన వరి పంట రకాలు

ఎంటీయూ - 1121 (శ్రీధృతి)	1,70,050 ఎకరాలు
బీపీటీ - 3291 (సోనామసూరి)	19,012 ఎకరాలు
ఎంటీయూ - 1064 (అమర)	14.426 ఎకరాలు
ఎంటీయూ - 7029 (స్వర్ణ)	10,344 ఎకరాలు
బీపీటీ-5204 (సాంబమసూరి)	10.198 ఎకరాలు
మిగిలినవి	2794 ఎకరాలు
మొత్తం సాగు	2,26,824 ఎకరాలు

సకాలంలో..



శ్రీధృతి పంట 130 రోజుల వ్యవధిలో అంది వచ్చింది. దోమపోటును కూడా తట్టుకుంది. అటు ప్రభుత్వం, ఇటు వ్యవసాయ శాఖ అధికారులు బాగా సహకరించారు. ఎకరాకు 25 నుంచి 28 క్వింటాళ్ల ధాన్యాన్ని దిగుబడి చేసే అవకాశం ఉంది.

– వావిలపల్లి రమణ, రైతు, వాల్తేరు, సంతకవిటి మండలం

మంచి పంట



ఈ ఏడాది రైతులు సాగు చేసే వరి పంట చాలా ఆశాజనకంగా ఉంది. శ్రీధృతి మంచి దిగుబడి వస్తుంది. నూర్పిడి చేస్తే ఎంత దిగుబడి అనేది తెలుస్తుంది. మద్దతు ధర కూడా బాగా ఉండడంతో రైతుకు కలసి వస్తుంది. ఇవి లోకల్‌గా కూడా మంచి డిమాండ్ ఉన్న బియ్యాన్ని ఉత్పత్తి చేస్తాయి. రైతుల్లో అవగాహన పెరిగి, వరి సాగులో కొత్త వంగడాలు వేస్తున్నారు.

– గేదెల వెంకటేశ్వరరావు, జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్

పంటకోత ప్రయోగాలు ప్రారంభిస్తున్నాం..



గత నాలుగేళ్లుగా పంటకోత ప్రయోగాలు, భూసార పరీక్షలు, ఆర్‌బీకే సేవలతో రైతుల్లో చైతన్యం వచ్చింది. ప్రస్తుతం రైతులు మంచి ఉత్పత్తులు, నాణ్యమైన పంటలు సాగు చేస్తున్నారు. శ్రీధృతి, సాంబమసూరి, సోనా మసూరి, స్వర్ణ ఈ రకానికి చెందినివే. శ్రీధృతి పంట ప్రస్తుతం రైతులకు మంచి ఆదాయాన్ని ఇచ్చే పంటగా మారింది. వీటి దిగుబడి బాగా కనిపిస్తుంది. పంటకోత ప్రయోగాలు ద్వారా పూర్తి వివరాలు తెలుస్తాయి.

– కె.చంద్రరావు, ఏడీఏ, వ్యవసాయ శాఖ

క్లుప్తంగా

9న శ్రీరామ విజయోత్సవ శోభాయాత్ర



గ్రౌండ్‌లో జరిగే ఏర్పాట్లను పరిశీలిస్తున్న నిర్వాహక కమిటీ

శ్రీకాకుళం కల్చరల్: అయోధ్య రామాలయం త్వరలో ప్రారంభం కానున్న నేపథ్యంలో శ్రీకాకుళం నారాయణ తిరుమల ఆధ్వర్యంలో శ్రీరామ విజయోత్సవ శోభాయాత్రను ఈ నెల 9న నిర్వహిస్తున్నట్లు విశాఖకు చెందిన పాంచరాత్రి ఆగమ పండితులు శేషాచార్యులు తెలిపారు. స్థానిక మున్సిపల్ హైస్కూల్ గ్రౌండ్‌లో చేస్తున్న ఏర్పాట్లను పరిశీలించి, తగు సూచనలు, సలహాలు కమిటీకి సోమవారం తెలియజేశారు.ఈ విజయోత్సవ యాత్ర నారాయణ తిరుమల నుంచి 3గంటలకు బయల్దేరుతుందని, ఇందులో హరిసంకీర్తన బృందాలు, కోలాటాల బృందాలు, చెక్క భజనలు ఉంటాయన్నారు. ఈ శోభాయాత్ర ఏడురోడ్ల కూడలి వద్ద మున్సిపల్ హైస్కూల్ గ్రౌండ్ వరకు సాగుతుందని తెలిపారు. అయోధ్య శ్రీరాముని పాదుకలు కూడా భక్తుల సందర్శనార్థం ఏర్పాటు చేస్తున్నామని, అందరూ వచ్చి దర్శించుకొని తరించాలని కోరారు. అలాగే 2వేల జంటలతో సీతారాముల కల్యాణ వేడుకలు జరుగుతాయని, భద్రాచలం, రామతీర్థాలు వంటి వివిధ క్షేత్రాల నుంచి పండితులు, స్వాములు హాజరవుతారని నారాయణ తిరుమల ప్రధాన అర్చకులు గురుగుబెల్లి శ్రీనివాసులు తెలిపారు. ఆధ్యాత్మిక వైభవం గోచరించే విధంగా రూ.12లక్షలతో ఆలయ సెట్ వేదికను రూపొందిస్తున్నామని తెలిపారు. సమావేశంలో కమిటీ సభ్యులు పేర్ల సాంబమూర్తి, నటుకుల మోహన్, శారద, కృష్ణమోహన్, శ్రావణ్ పాల్గొన్నారు.

విద్యార్థినికి అభినందనలు



పల్లవిని అభినందిస్తున్న ట్రిపుల్ ఐటీ డైరెక్టర్ ప్రొఫెసర్ పెద్దాడ జగదీశ్వరరావు, అధికారులు

ఎచ్చెర్ల క్యాంపస్: శ్రీకాకుళం రాజీవ్ గాంధీ వైజ్ఞానిక సాంకేతిక విశ్వవిద్యాలయం (ట్రిపుల్ ఐటీ) ఎస్ఎం పురం క్యాంపస్ ప్రీ యూనివర్సిటీ కోర్సు మొదటి సంవత్సరం విద్యార్థిని పీహెచ్ పల్లవి ఫెన్సింగ్ రాష్ట్రస్థాయి పోటీలో బంగారు పతకం సాధించింది. జాతీయ స్థాయి స్పోర్ట్స్ మీట్‌కు అర్హత సాధించింది. ఈ నెల 19న జమ్మూ కశ్మీర్ రాష్ట్రంలో జరగనున్న జాతీయస్థాయి స్పోర్ట్స్‌మీట్‌లో పాల్గొననుంది. దీంతో ఎస్ఎంపురం క్యాంపస్‌లో శ్రీకాకుళం డైరెక్టర్ ప్రొఫెసర్ పెద్దాడ జగదీశ్వరరావు ఆమెను ప్రత్యేకంగా అభినందించారు. జాతీయస్థాయి పోటీల్లో సత్తా చాటాలని పిలుపు నిచ్చారు. ట్రిపుల్ ఐటీలో క్రీడాకారులకు ప్రత్యేకంగా ప్రోత్సహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఫిజికల్ ఎడ్యుకేషన్ శిక్షకులు రాజు, దిలీప్ కుమార్, ఓఎస్‌డీ ప్రొఫెసర్ ఎల్. సుధాకర్ బాబు, పరిపాలన అధికారి ముని రామకృష్ణ, అకడమిక్ డీన్ కె.మోహనకృష్ణ పాల్గొన్నారు.

తప్పిన ముప్పు



డివైడర్‌పైకి దూసుకుపోయిన ఆర్టీసీ బస్సు

ఎచ్చెర్ల క్యాంపస్: విశాఖపట్నం నుంచి శ్రీకాకుళం వైపు వస్తున్న ఆర్టీసీ బస్సు సోమవారం ఎచ్చెర్ల సమీపంలోని పాత జాతీయ రహదారిపై డివైడర్‌పైకి దూసుకుపోయింది. బస్సు స్టీరింగ్ పట్టేయటంతో అదుపు తప్పినట్లు సమాచారం. అయితే ఘటనలో ఎవరికీ ఎలాంటి హాని జరగలేదు. అనంతరం క్రేన్ సాయంతో బస్సును తొలగించి కాంప్లెక్సుకు తరలించారు. బస్సు కింద భాగం డివైడర్‌కు తాకటంతో దెబ్బ తింది. ప్రమాణికులను వేరే బస్సులో కాంప్లెక్స్‌కు తీసుకువెళ్లారు.

కుటుంబ కలహాలతో వ్యక్తి ఆత్మహత్య

రణస్థలం: మండలంలోని కొండములగాం పంచాయతీలో గల ముక్తుంపురం గ్రామానికి చెందిన కాకి రమణ(27) ఆదివారం రాత్రి ఉరి వేసుకుని ఆత్మ హత్య చేసుకున్నాడని జేఆర్ పురం పోలీసులు తెలిపారు. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాలు ప్రకారం.. కాకి రమణకు, చీపురుపల్లి మండలంలోని అకులు ములగాం గ్రామానికి చెందిన భవానీతో రెండేళ్ల కిందట పెళ్లయ్యింది. ఇరువురికీ మనస్పర్థలు ఏర్పడడంతో ఏడాదిగా వేరువేరుగా ఉన్నారు. ఈ నేపథ్యంలో మానసికంగా ఆందోళన చెందిన రమణ ఆదివారం రాత్రి ముక్తుంపురంలో తన ఇంటి సమీపంలోని గొర్రైల పాకలో ఉరివేసుకున్నాడు. సోమవారం ఉదయం 7.30 గంటల సమయంలో కుటుంబ సభ్యులు చూసి కన్నీరుమున్నీరయ్యారు. తండ్రి రాములు ఇచ్చిన ఫిర్యాదు మేరకు జేఆర్ పురం ఎస్ఐ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

అన్నదాతకు ఆర్థిక భరోసా

రైతే రాజు అనే నినాదం నిజం చేసేలా రాష్ట్రంలో జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం అన్నదాతకు అన్ని విధాల అండగా ఉంటూ ఆర్థిక భరోసానిస్తోంది. ఇందు కోసం రైతుభరోసా నుంచి ఆర్‌బీకేల వరకు అన్నదాతకు అన్ని విధాల సాయం చేస్తూ సాగుకు భరోసా కల్పిస్తోంది.

- నేడు రైతు భరోసా
- పీఎం కిసాన్ నిధులు విడుదల
- 1,45,954 మంది రైతులకు లబ్ధి
- రైతుల ఖాతాల్లో జమ కానున్న మొత్తం రూ.59.72 కోట్లు

పార్వతీపురం టౌన్:

అన్నదాతకు సాగు పెట్టుబడి కోసం ప్రభుత్వం అందిస్తున్న వైఎస్సార్ రైతు భరోసా – పీఎం కిసాన్ పథకం ఐదవ విడత ఆర్థిక సాయం రైతుల ఖాతాల్లో మంగళవారం జమ కానుంది. పీఎం కిసాన్ ద్వారా రూ.2 వేలు, కొండపోడు (ఆర్ఓఎఫ్ఆర్) రైతు భరోసా ద్వారా రూ.2 వేల చొప్పున. జిల్లా వ్యాప్తంగా 1,45,954 మంది రైతులకు రూ.59.72 కోట్లు జమ చేయనున్నారు. సాయం అందుకుంటున్న వారిలో 18,803 మంది కొండపోడు వ్యవసాయ రైతులు కూడా ఉన్నారు. ప్రస్తుతం ఇస్తున్న ఆర్థిక సాయం ఎరువుల కొనుగోలుకు ఉపకరిస్తుందని రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ఖరీఫ్ సాగు ఆరంభమైన జూన్ నెలలో ఒక్కో రైతుకు రూ.7,500 చొప్పున జమ చేశారు. అప్పట్లో 1,42,930 మంది రైతులకు మేలు జరిగింది. ఇప్పుడు 1,45,954 మంది రైతులకు ఆర్థిక లబ్ధి చేకూరనుంది. సాగు సమయంలో రైతులు పెట్టుబడి కోసం అప్పులు చేయాల్సిన అవసరం లేకుండా రైతు భరోసా, పీఎం కిసాన్ పథకాల ద్వారా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఏటా మూడు విడతల్లో రూ.13,500 చొప్పున ఆర్థిక సాయం అందిస్తున్నాయి. నేడు పీఎం కిసాన్ ద్వారా మరో రూ.2000 చొప్పున రైతుల ఖాతాల్లో జమ చేయనున్నారు. రైతు భరోసా ఆర్థిక సాయం పంపిణీ కార్యక్రమం పార్వతీపురం కలెక్టర్ కార్యాలయంలో కలెక్టర్ నిశాంత్‌కుమార్ ఆధ్వర్యంలో జిల్లా ప్రజాప్రతినిధులు, అధికారులతో, గ్రామాల్లో రైతు భరోసా కేంద్రాల వద్ద మండల స్థాయి అధికారులతో మంగళవారం నిర్వహించనున్నారు.



ఈ–కేవైసీ తప్పనిసరి

రైతుభరోసా, పంటల బీమా లబ్ధి, సున్నా వడ్డీ వంటి పథకాలు వర్తించాలంటే రైతులందరూ తాము సాగుచేస్తున్న పంటల వివరాలను ఈ–క్రాప్ చేయించుకోవడంతో పాటు, తప్పనిసరిగా ఈ–కేవైసీ చేయించుకోవాలి. అన్ని రకాల వ్యవసాయ సంబంధిత పథకాలు పొందడానికి, ప్రకృతి వైపరీత్యాల వలన దెబ్బతిన్న పంటలకు పరిహారం పొందాలన్నా ఈ–కేవైసీ తప్పనిసరి. జిల్లా వ్యాప్తంగా 3 లక్షల ఎకరాల్లో వివిధ పంటలు సాగు చేస్తున్నారు. వీటికి సంబంధించి ఈ–కేవైసీ చేయించుకున్న వారికి పీఎం కిసాన్ సొమ్ము జమ కానుంది.

జోరందుకుంటున్న విమానాశ్రయ పనులు





విమానాశ్రయ నిర్మాణం కొరకు చదును చేసిన భూమి, (ఇన్‌సెట్లో)విమానాశ్రయ నిర్మాణానికి సామగ్రి సిద్ధం చేస్తున్న ఎల్‌అండ్‌టీ సంస్థ

భోగాపురం: భోగాపురం మండలంలో నూతనంగా నిర్మించనున్న అంతర్జాతీయ విమానాశ్రయ నిర్మాణ పనులు జోరందుకున్నాయి. విమానాశ్రయ నిర్మాణానికి సంబంధించి ప్రభుత్వం ఇప్పటికే జీఎమ్ఆర్ సంస్థతో ఒప్పందం కుదుర్చుకున్న విషయం తెలిసిందే. ఇందులో భాగంగా జీఎమ్ఆర్ సంస్థ విమానాశ్రయ నిర్మాణానికి సంబంధించిన పలు పనులను సబ్ కాంట్రాక్టర్లకు అప్పగించింది. ఎల్ అండ్‌టీ, జీఎమ్ఆర్ సంస్థలు సంయుక్తంగా పలు పనులకు ఈ నెల 1వ తేదీన శంకుస్థాపన చేశారు. అనంతరం మరడపాలెం సమీపంలో భూమి చదును పనులు ప్రారంభించారు. ప్రభుత్వం నిర్దేశించిన సమయానికి విమానాశ్రయ పనులను పూర్తి చేయడమే లక్ష్యంగా జీఎమ్ఆర్ ముందుకు సాగుతోంది. పనులను జీఎమ్ఆర్ సంస్థ చైర్మన్ గ్రంధి మల్లికార్జునరావు, ఎల్‌అండ్‌టీ సంస్థ ప్రతినిధులు పర్యవేక్షిస్తున్నారు.

గుండె చికిత్స కోసం రూ.1.18లక్షలు ఆర్థిక సాయం

వజ్రపుకొత్తూరు: మండలంలోని పెద్దమురహరిపురం గ్రామానికి చెందిన భద్రాచలం తారకేశ్వరరావు గుండెకు సంబంధించి వ్యాధితో బాధ పడుతుండడంతో సోమవారం అతనికి గ్రామస్తులు రూ.1.18 లక్షలు ఆర్థిక సాయం అందించారు. ఆయనకు గుండెలో సీఆర్‌టీ అనే పరికరం అమర్చితేనే బతికే చాన్సు ఉందని వైద్యులు చెప్పారు. రూ.8 లక్షల వరకు ఖర్చవుతుందని వారు చెప్పడంతో పెద్దమురహరిపురం డెవలప్‌మెంట్ ఫోరం(పీడీఎఫ్) స్పందించింది. గ్రామంలోని ఉద్యోగులు, సైనిక సేవా సమితి నుంచి సైనికులు, మాజీ సైనికులు, విదేశాల్లో ఉన్నవారు, గ్రామస్తుల సహకారంతో విరాళాలు సేకరించి రూ.1,18,000 నగదును తారకేశ్వరరావుకు అందించారు. కార్యక్రమంలో పీడీఎఫ్ ప్రతినిధులు పి.తిరుపతిరావు, కె.సింహాచలం, ఇ.శ్రీనివాసరావు, చిన్నారావు, స్థానిక సర్పంచ్ జి.వసంతరావు, గ్రామాభివృద్ధి సంఘం అధ్యక్షుడు కె.గోపాల్, ఎంపీటీసీ సభ్యుడు వసంతరావు, గ్రామ పెద్ద లోకరాజు, మాజీ ఎంపీటీసీ దానేష్, ఎన్. గణేష్, సైనిక సేవా సమితి ప్రతినిధులు పి.లోకనాథం, టి.మురళి, తదితరులు పాల్గొన్నారు.



తారకేశ్వర రావుకు రూ.1.18లక్షల నగదు అందిస్తున్న పీడీఎఫ్ ప్రతినిధులు, గ్రామస్తులు

గురుకుల పాఠశాల పరిశీలన

శ్రీకాకుళం రూరల్ : మండల పరిధిలో గల పెద్దపాడు అంబేడ్కర్ సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల, కళాశాలను ఎస్పీ జీఆర్ రాధిక సోమవారం సందర్శించారు. ఉపాధ్యాయులతో కలిసి తరగతి గదులను, వసతి గదులను పరిశీలించడమే కాక సీసీ కెమెరాల పనితీరుపై ఆరా తీశారు. అనంతరం విద్యార్థులతో ఎస్పీ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ క్రమశిక్షణతో విద్యాభ్యాసం చేయాలని, ఉన్నత ఆశయాల దిశగా ముందుకు సాగాలని, ఆటల్లో ప్రావీణ్యం చూపించాలని సూచించారు. పోక్సో, దిశ వంటి మహిళా చట్టాలపై అవగాహన ఉండాలని, గుడ్ టచ్ బ్యాడ్ టచ్ గురించి తెలిసి ఉండాలని, అవాంఛనీయ ఘటనలు ఎదురైనప్పుడు పోలీసులకు తెలియజేయాలన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ జ్యోతి, పాఠశాల సిబ్బంది ఉన్నారు.



విద్యార్థులు, ఉపాధ్యాయులతో ఎస్పీ రాధిక

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు

శ్రీకాకుళం క్రైమ్ : నగరంలోని బలగ మెట్టు శివాలయం రోడ్డు సమీపంలో స్కూటీపై వెళ్తున్న వ్యక్తిని ఎదురుగా వచ్చిన లగేజీ వ్యాను ఢీకొట్టింది. ప్రమాదంలో ఆ వ్యక్తి గాయపడినట్లు ట్రాఫిక్ ఎస్ఐ జె.రామారావు పేర్కొన్నారు. బూర్జ మండలం గుత్తావెల్లికి చెందిన పైడి వెంకటరమణ (55) నగరంలోని పీఎన్ కాలనీలో ఉంటున్న తన కుమార్తె ఇంటికి వెళ్లడానికి స్కూటీపై వస్తుండగా మార్గం మధ్యలో టాటా ఏసీ లగేజీవ్యాను ఢీకొట్టడంతో రోడ్డుపై పడిపోయారు. దీంతో తీవ్రంగా గాయాలయ్యాయి. అయితే ప్రమాదం జరిగాక వ్యాన్ డ్రైవర్ ఆపకుండా పరారైపోయాడు. క్షతగాత్రుడిని రిమ్స్‌కు తరలించారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ రామారావు తెలిపారు.

రైతుపై గుర్తు తెలియని జంతువు దాడి

మందస: మండలంలోని మూలిపాడు గ్రామానికి చెందిన తిరుమరెడ్డి మోహనరావు అనే రైతుపై సోమవారం సాయంత్రం గుర్తు తెలియని జంతువు దాడి చేసింది. మోహనరావు పొలానికి నీరు పెట్టడానికి వెళ్తుండగా లచ్చయ్య చెరువు వద్ద చిరుత పులి ఆకారంలో ఉన్న జంతువు దాడి చేయడంతో గాయపడ్డాడు. దీంతో స్థానికులు ఆయనను హరిపురం సామాజిక ఆరోగ్యకేంద్రానికి తీసుకువెళ్లారు. అక్కడి వైద్యులు చికిత్స చేసి, ప్రమాదం లేదని చెప్పారు. దాడి చేసిన జంతువు అడవిపిల్లిగా అనుమానిస్తున్నారు. దీన్ని ఈ ప్రాంతంలో చిట్టెడుపులి అంటారని అటవీ శాఖాధికారులు చెప్పారు. దీనిపై సమాచారం అందు కున్న కాశీబుగ్గ రేంజ్ అధికారి ఎ.మురళీకృష్ణనాయుడు, డిప్యూటీ రేంజ్ అధికారి ఐ.రాము, ఫారెస్ట్ సెక్షన్ అధికారి డీపీరెడ్డి, బీట్ అధికారులు తూలుగు వెంకటేశ్వరరావు, మల్లిపురం పోలయ్య, రత్నాల వినీల, సతివాడ దుర్గాదేవి, అమెరెపు బాబురావు, రాణా సంతోష్‌కుమార్, టైగర్ స్క్వాడ్ బృందం హరిపురం సామాజిక ఆరోగ్యకేంద్రానికి చేరుకున్నారు. బాధితుడి నుంచి వివరాలు సేకరించి, స్టేట్‌మెంట్ రికార్డు చేశారు. రెండు రోజుల కిందట మూలిపాడు ప్రాంతంలో పెద్దపులి సంచరించడంతో ఆ కోణంలో దర్యాప్తు చేశారు. మోహనరావు ఇచ్చిన స్టేట్‌మెంట్ ప్రకారం అడవిపిల్లి/పెద్దబావురుపిల్లి అయి ఉంటుందని రేంజ్ అధికారి మురళీకృష్ణనాయుడు చెప్పారు. దాడి చేసింది పెద్దపులి కాదని స్పష్టం చేశారు. ప్రజలు భయభ్రాంతులకు గురికావద్దని కోరారు.



గాయపడిన మోహనరావు నుంచి వివరాలు సేకరిస్తున్న అటవీశాఖాధికారులు

9న కారా మాస్టారు శతజయంతి ఆరంభ సభ

శ్రీకాకుళం కల్చరల్: శ్రీకాకుళ సాహితీ సంస్థ ఆధ్వర్యంలో ఈ నెల 9న కాళీపట్నం రామారావు మాస్టారు శత జయంతి ఆరంభ సభ కార్యక్రమం కథా నిలయంలో నిర్వహించనున్నట్లు నిర్వాహకులు ఓ ప్రకటనలో తెలిపారు. కార్యక్రమానికి అధ్యక్షులుగా అట్టాడ అప్పలనాయుడు, ముఖ్య అతిథిగా ప్రముఖ నాటక రచయిత డాక్టర్ దీర్ఘాసి విజయభాస్కర్, సీనియర్ జర్నలిస్టు నల్లి ధర్మారావులు హాజరవుతారని తెలిపారు.

ఎస్‌జీఎఫ్ జిల్లా అండర్-19 కార్యదర్శిగా బీవీ రమణ

శ్రీకాకుళం న్యూకాలనీ: జిల్లా స్కూల్‌గేమ్స్ అండర్-19(ఇంటర్మీ డియెట్) కార్యదర్శిగా బడి వెంకట రమణను నియమించారు. ఈ మేరకు ఇంటర్మీడియెట్ విద్య జిల్లా వృత్తి విద్యాధికారి కోట ప్రకాశరావు నియామక ఉత్తర్వులు జారీ చేశారు. ఎస్.రామన్న స్థానంలో బీవీ రమణ పని చేస్తారు. లావేరు మండలంలోని అదపాక జెడ్పీ హైస్కూల్‌లో ఫిజికల్ డైరెక్టర్‌గా పనిచేస్తున్న బీవీ రమణ గత ఏడాది నుంచి జిల్లా పాఠశాల విద్య ఎస్‌జీఎఫ్ కార్యదర్శిగా విశేషంగా సేవలు అందిస్తున్నారు. గణనీయమైన ప్రగతిని, ఫలితాలను సాధిస్తున్నారు. ఈయన నియామకంపై ఇంటర్మీడియెట్ విద్య డీవీఈఓ కోట ప్రకాశరావు, ఆర్ఐఓ పి.దుర్గారావు, డీఈవో కె.వెంకటేశ్వరరావు, ఒలింపిక్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు, ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్, కార్యదర్శి ఎం.సాంబమూర్తి, జిల్లా పీఈటీ సంఘ అధ్యక్షుడు ఎంవీ రమణ, గ్రిగ్స్ సెక్రటరీ కె.మాధవరావు తదితరులు అభినందించారు.

'ఆసరా' పోస్టర్ ఆవిష్కరణ

శ్రీకాకుళం పాతబస్టాండ్: అడ్వకేట్స్ అసోసియేషన్ ఫర్ సోషల్ రెస్పాన్సిబులిటీ అండ్ అవేర్‌నెస్ (ఆసరా) ఆధ్వర్యంలో ఈ నెల 24న న్యూఢిల్లీ కాన్‌స్టిట్యూషనల్ క్లబ్‌లో జరగనున్న జాతీయ స్థాయి వినియోగదారుల హక్కుల అవగాహన కార్యక్రమానికి సంబంధించిన పోస్టర్, బ్రోచర్ జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి ఆర్.సన్యాసినాయుడు సోమవారం తన చాంబర్‌లో ఆవిష్కరించారు. ఆసరా ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న కార్యక్రమాలను సంస్థ ప్రతినిధులు వివరించారు. గంజి ఎజ్రా, జి.ఇందిరాప్రసాద్, కె .వేణుగోపాల్ వివరించారు. కార్యక్రమంలో న్యాయవాదులు అన్నెపు సత్యనారాయణ, కద్దాల శ్యామసుందర్, కె.పి.శారది, లఖినేని రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

రైలు ఢీకొని మహిళ మృతి

ఆమదాలవలస: శ్రీకాకుళం రోడ్ (ఆమదాలవలస) రైల్వే స్టేషన్‌లో సోమవారం డీఎంయూ పాసింజర్ ఢీకొని ఎ.లీలారాణి(47) అనే మహిళ మృతి చెందినట్లు జీఆర్పీ పోలీసులు తెలిపారు. వారు తెలిపిన వివరాల మేరకు.. ఆమదాలవలస పట్టణం చంద్రయ్యపేటకు చెందిన లీలారాణి ఉదయం 6:20 గంటల సమయంలో విశాఖ వెళ్లేందుకు స్టేషన్‌కు వచ్చారు. రైలు ఎక్కేందుకు ట్రాక్ దాటి వెళ్లాలనే ప్రయత్నంలో పాసింజర్ రైలును గమనించక పోవడంతో అదే రైలు ఢీకొని అక్కడికక్కడే మృతి చెందారు. మృతురాలికి వినోద్‌కుమార్, శ్రావణ్ కుమార్ అనే ఇద్దరు కుమారులు ఉన్నారు. భర్త గజపతిరావు అక్కులపేట పాఠశాలలో రికార్డు అసిస్టెంట్‌గా పనిచేస్తున్నారు.

'స్వామిత్వ'తో శాశ్వత భూహక్కు

అరసవల్లి: గ్రామాల్లో ఇళ్ల స్థలాలకు యాజమాన్య హక్కులను ఖరారు చేసేందుకు ఉద్దేశించిన సర్వే ఆఫ్ విలేజీ అండ్ మ్యాపింగ్ విత్ ఇంప్రోవైజ్డ్ టెక్నాలజీ ఇన్ విలేజి ఏరియాస్ (స్వామిత్వ) కార్యక్రమం ద్వారా గ్రామీణ ప్రజలకు శాశ్వత భూహక్కు పత్రాలు అందుతాయని జిల్లా పంచాయతీ అధికారి వి.రవికుమార్ తెలియజేసారు. జిల్లాలో 2020 అక్టోబర్ 11న ఈ కార్యక్రమాన్ని ప్రారంభించామని, జిల్లాలో 599 గ్రామ పంచాయతీల్లో ఇప్పటికి 140 గ్రామాల్లో ఇంటింటి సర్వే పూర్తి చేయించామని వివరించారు. పంచాయతీ సర్వే అధికారులు ప్రజల వద్దకు వచ్చినప్పుడు ప్రజలు తమ వద్దనున్న ఆస్తి పత్రాల నకళ్లను అందజేసి సహకరించాలని కోరారు. కార్యక్రమంలో భాగంగా ప్రాపర్టీ పార్సిల్ మ్యాప్ (పీపీఎం) నందు లబ్ధిదారులకు జారీ చేసి ఆస్తి యాజమాన్య హక్కు కల్పిస్తామని డీపీఓ రవికుమార్ తెలిపారు.

రైతన్నకు అండదండ

- నేడు వైఎస్సార్ రైతు భరోసా రెండో విడత నగదు విడుదల
- 3.21లక్షల మందికి లబ్ధి



జిల్లా వ్యవసాయాధికారి కె.శ్రీధర్

శ్రీకాకుళం (పీఎన్ కాలనీ): వైఎస్సార్ రైతు భరోసా పథకం కింద ఈ ఏడాది రెండో విడత 3.21లక్షల మందికి రైతులకు గాను రూ.132.41కోట్లు అందించనున్నట్లు వ్యవసాయ జిల్లా అధికారి కె.శ్రీధర్ తెలిపారు. ఈ మేరకు సోమవారం ఓ ప్రకటన విడుదల చేశారు. ప్రతి రైతు కుటుంబానికి పెట్టుబడి ఆర్థిక సాయం కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కలిసి రూ.13,500 ఆర్థిక సాయం చేస్తున్నాయని పేర్కొన్నారు. సొంత భూమిలేని ఎస్సీ, ఎస్టీ,బీసీ, మైనార్టీ వర్గాలకు చెందిన వర్గాలకు చెందిన కౌలు రైతులకు (సిసిఆర్‌సి పత్రాలు కలిగిన వారికి), ఆర్ఓఎఫ్ఆర్ పట్టా కలిగిన రైతులకు పూర్తి స్థాయిలో రాష్ట్ర ప్రభుత్వమే రూ.13500 ఆర్థిక సాయం చేస్తోందని తెలిపారు. మంగళవారం శ్రీకాకుళం జిల్లా కేంద్రంలోని బాపూజీ కళా మందిర్‌లో కార్యక్రమం నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు.

సొగసు చూడ తరమా..



ఎర్ర రంగు పూసుకున్న ఆకాశంలో నల్లటి మబ్బులు సరికొత్త అందాలను ఆవిష్కరించాయి. అక్కుపల్లి శివసాగర్ తీరం వద్ద కనిపించిన ఈ దృశ్యం చూపరులను కట్టి పడేసింది.
- వజ్రపుకొత్తూరు రూరల్

ఎస్‌జీఎఫ్ సాఫ్ట్‌బాల్‌లో అద్వితీయ ప్రతిభ

ఒంగోలు: స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ అండర్–17 అంతర్ జిల్లాల సాఫ్ట్ బాల్ పోటీల్లో విజేతగా బాలుర విభాగంలో వైఎస్సార్ కడప జిల్లా జట్టు, బాలికల విభాగంలో విజయనగరం జట్టు జయకేతనం ఎగురవేశాయి. 67వ అంతర్ జిల్లాల సాఫ్ట్‌బాల్ పోటీల ముగింపు కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఏఆర్ అదనపు ఎస్పీ అశోక్‌బాబు మాట్లాడుతూ.. క్రీడాకారులు తమకు అందివచ్చిన అవకాశాన్ని వినియోగించుకుంటూ ఉన్నత స్థానానికి చేరుకోవాలని ఆకాంక్షించారు. క్రీడలతోపాటు చదువుపైనా దృష్టి సారిస్తే జీవితంలో విజయం సొంతమవుతుందని పేర్కొన్నారు. చెడు వ్యసనాలు, మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని సూచించారు.

ఎస్‌జీఎఫ్ క్రీడల రాష్ట్ర పరిశీలకుడు జగదీశ్వర రెడ్డి మాట్లాడుతూ.. పోటీలకు ప్రకాశం జిల్లా ఆతిథ్యం బాగుందని కితాబిచ్చారు. ఎస్‌జీఎఫ్ జిల్లా కార్యదర్శి కె.వనజ మాట్లాడుతూ.. ఎస్‌జీఎఫ్ పోటీల్లో పాల్గొనే జిల్లా జట్లకు తొలిసారిగా రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ఆకర్షణీయమైన క్రీడా దుస్తులు, ట్రోఫీలు అందించిందని, తద్వారా క్రీడలకు ఇస్తున్న ప్రాధాన్యమేంటో స్పష్టమైందన్నారు. సాఫ్ట్ బాల్ అంతర్‌జిల్లాల నిర్వాహక కార్యదర్శి శివశంకరరావు మాట్లాడుతూ.. క్రీడాకారులు, కోచ్‌లకు భోజన సదుపాయం కల్పించేందుకు విద్యాశాఖ రూ.3 లక్షలు వెచ్చించడం అభినందనీయమంటూ డీఈఓ వీఎస్ సుబ్బారావుకు కృతజ్ఞతలు తెలియజేశారు. పీఈటీ సంఘ కార్యదర్శులు నత్తల కృష్ణ, వై.శీనయ్య, పలువురు పీఈటీలు, పీడీలు పాల్గొని పోటీలను పర్యవేక్షించారు.

పోటీల విజేతలు వీరే..

బాలుర విభాగం : వైఎస్సార్ కడప(ప్రథమ స్థానం), శ్రీకాకుళం(ద్వితీయ), విజయనగరం(తృతీయ)
బాలికల విభాగం : విజయనగరం(ప్రథమస్థానం), వైఎస్సార్ కడప(ద్వితీయ స్థానం), ప్రకాశం(తృతీయ)

అండర్ 17 ఎస్‌జీఎఫ్ సాఫ్ట్‌బాల్ రాష్ట్ర జట్ల ఖరారు

ఒంగోలు: అండర్–17 స్కూల్‌గేమ్స్ ఫెడరేషన్ సాఫ్ట్‌బాల్ రాష్ట్ర జట్లను ఎంపిక చేసినట్లు ఎస్‌జీఎఫ్ సాఫ్ట్‌బాల్ అంతర్ జిల్లాల పోటీల పరిశీలకుడు జగదీశ్వరరెడ్డి ప్రకటించారు. ఈనెల 4 నుంచి 6వ తేదీ వరకు స్థానిక పీవీఆర్ బాలుర ఉన్నత పాఠశాల ఆవరణలో జరిగిన పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన క్రీడాకారులతో బాల, బాలికల జట్లను ఎంపిక చేశారు. పరిశీకులు జగదీశ్వరరెడ్డి, కమిటీ సభ్యులు సీహెచ్ సత్యన్నారాయణ (విజయనగరం), కె.గోపాల్‌రెడ్డి (అనంతపురం), కృష్ణకుమార్(కృష్ణాజిల్లా) ఈ రాష్ట్ర జట్లను ఎంపిక చేశారు. ఎంపిక చేసిన జట్లు త్వరలో జరిగే జాతీయ స్థాయి ఎస్‌జీఎఫ్ సాఫ్ట్‌బాల్ పోటీల్లో ఆంధ్రప్రదేశ్ తరపున ప్రాతినిధ్యం వహిస్తాయి.

బాలుర రాష్ట్ర జట్టు: వై.లక్ష్మీ ప్రసన్న, ఎం.యశ్వంత్ (శ్రీకాకుళం), కె.ఆంజనేయులు (వైఎస్సార్ కడప), ఎస్.మధుసూదనరావు (శ్రీకాకుళం), పి.జనార్దన్‌రావు (విజయనగరం), ఎం.మనోజ్ (వైఎస్సార్ కడప), డి.రాఘవ (విజయనగరం), పి.మహీధర్ (వైఎస్సార్ కడప), బి.నారాయణస్వామి (అనంతపురం), బి.మహేష్ (పశ్చిమ గోదావరి), ఎం.ఆకాష్ (గుంటూరు), పి.యశ్వంత్(పశ్చిమగోదావరి), టి.నాగేంద్ర (శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా), పి.హరీష్‌సాయి (ప్రకాశం), బి.లక్ష్మణ్ స్వామి(విశాఖపట్నం), సీహెచ్ పీటర్ (ప్రకాశం), స్టాండ్‌బైలుగా ఎ.కార్తీక్ (గుంటూరు), కె.శశి (అనంతపురం), కె.హేమంత్ కుమార్ (కృష్ణా), డి.నవీన్ (వైఎస్సార్ కడప), కె.రోహిత్ (విజయనగరం).

బాలికల జట్టు:
టి.ప్రశాంతి (విజయనగరం), ఎం.వీరనారాణమ్మ (వైఎస్సార్ కడప), సీహెచ్ అనిత (గుంటూరు), బి.సుప్రియ (విజయనగరం), ఎస్.సల్మ (ప్రకాశం), ఎం.శివ నాగలక్ష్మి (ప్రకాశం), పి.హైమావతి (విజయనగరం), ఎన్.బేబి (ప్రకాశం), జి.సునందిని(గుంటూరు), బి.నవ్యశ్రీ (కర్నూలు), కె.రాజేశ్వరి (అనంతపురం), జె.సంజన చౌదరి (ప్రకాశం), వి.యవంతిక(ప్రకాశం), కె.రిషిత (కృష్ణా), పి.రేణుక (శ్రీకాకుళం), ఎస్.భువనేశ్వరి (తూర్పు గోదావరి), స్టాండ్‌బైలుగా టి.కీర్తన (ప్రకాశం), పి.చైతన్య కుమారి (విజయనగరం), కె.రోజా (గుంటూరు), జి.నీల (విశాఖపట్నం), టి.సుకన్య (అనంతపురం).

కాలువలో పడి వ్యక్తి మృతి

నరసన్నపేట, గార: మండలంలోని వీఎన్ పురానికి చెందిన చోడి రమణ (40) ప్రమాదవశాత్తు కాలువలో పడి మృతి చెందాడని కుటుంబ సభ్యులు తెలిపారు. అనారోగ్యంతో ఉన్న రమణను వారం కిందట కుటుంబ సభ్యులు రిమ్స్‌లో చేర్చారు. ఒక రోజు చికిత్స అనంతరం ఆయన కనిపించలేదు. కుటుంబ సభ్యులు మూడు రోజులుగా అన్ని చోట్లా వెతుకుతున్నారు. ఇంతలో గార మండలం బలరాంపురం పంచాయతీ శ్రీకూర్మనాథపురంలోని రెల్లివీధిలో ఓ వ్యక్తి ఫిట్స్‌తో పడిపోయారని వీరికి సమాచారం వచ్చింది. అక్కడకు వెళ్లి చూసేసరికి ఆయన కనిపించలేదు. ఆ తర్వాత సాగునీటి కాలువలో ఒకరి మృతదేహం స్థానికులకు కనిపించగా అతడిని చోడి రమణగా స్థానికులు గుర్తించి కుటుంబ సభ్యులకు చెప్పారు. ఫిట్స్ వచ్చి నీటిలో పడి మృతి చెంది ఉంటారని భార్య సంధ్యారాణి, కుమారులు దుర్గారావు, సంతోష్ తెలిపారు. రమణ మృతితో వీఎస్ పురంలో విషాదం అలుముకుంది. మృతదేహానికి సోమవారం రిమ్స్ లో పోస్టుమార్టం అనంతరం స్వగ్రామానికి తీసుకువచ్చి దహన సంస్కారాలు నిర్వహించారు. రమణ మృతికి సర్పంచ్ పుట్టా ఆదిలక్ష్మి సంతాపం వ్యక్తం చేశారు. భార్య సంధ్యారాణి ఇచ్చిన ఫిర్యాదుతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని సీఐ ఎస్.కామేశ్వరరావు తెలిపారు.



చోడి రమణ (ఫైల్)

ఇకపై 'డాక్టర్ వైఎస్సార్ సుజల ధార ప్రాజెక్టు'



ఉద్దానం కిడ్నీ బాధితుల కోసం ప్రభుత్వం రూ.700 కోట్లతో నిర్మించిన ఉద్దాన మంచినీటి పథకానికి 'డాక్టర్ వైఎస్సార్ సుజల ధార ప్రాజెక్టు'గా నామకరణం చేశారు. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వం పంచాయతీ రాజ్ అండ్ రూరల్ డెవలప్‌మెంట్ శాఖ తరపున జీఓ నంబర్ 85ను సోమవారం విడుదల చేసింది. ఈ ప్రాజెక్టు ద్వారా హిరమండలం నుంచి 105 కిలోమీటర్ల దూరంలో ఉన్న పలాస, ఇచ్ఛాపురం నియోజకవర్గాలకు మంచినీరు వస్తుంది. వైఎస్సార్ హయాంలో హిరమండలం వంశధార ప్రాజెక్టు పూర్తయ్యింది. అక్కడి నుంచి నీటిని ఉద్దాన కిడ్నీ బాధితులకు తరలిస్తుండటంతో స్థానికంగా హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయి.

–కాశీబుగ్గ